

# మూడో సీతకథ

బ్రాహ్మణ పిల్ల

– భువనచంద్ర



(గత సంచిక తరువాయి)

***మౌత్..కీ.కహానీ***

'చావు'ని చూడటం అదే నాకు మొదటిసారి. కళ్ళు తెరుచుకున్నా మూసుకున్నా రామారావు శవమే కనిపిస్తోంది. నిశ్చలంగా పడివున్న ఆ శరీరాన్ని తల్చుకుంటుంటే ఏదో చెప్పలేని బాధ. నిన్నటివరకూ కలిసి వున్నాం. ఆడుకున్నాం... తిట్టుకున్నాం.. మరి ఇవాళ? అతను మళ్ళీ తిరిగిరాడు. తల్లిదండ్రులకి ఆ కడుపు కోత యీ జన్మకు తీరదు.

"జననమరణాలు సహజం.. కోట్లాది జీవుల పుట్టుకా, కోట్లాది జీవుల మరణం. ఇదో సహజ పరిణామం. పుట్టిన ప్రతి వ్యక్తీ చనిపోక తప్పదుకదా.! అందుకే, బ్రతికివున్న క్షణాలు విలువ అమూల్యం. విచారంతో క్షణాల విలువని విస్మరించకు.!" వీలున్నంతగా మానాన్న నన్ను సముదాయించే ప్రయత్నం చేశాడు. రామారావు కూర్చునేచోటు 'ఖాళీ'గా ఉంది. అతడిదీ మా క్లాసే థర్డ్‌ఫాం ఏ సెక్షన్. అటు మాస్టార్లకి పాఠం చెప్పాలని, ఇటు విద్యార్థులకి పాఠం వినాలనీ లేకపోవడంతో రోజంతా రామారావు జ్ఞాపకాలతోనే గడచింది.

వర్షాకాలంలో పెద్ద చెరువు నిండుగా నిండు గర్భిణీలా వుండేది. అప్పుడు కూడా కుర్రాళ్ళు యీతలు కొట్టేవాళ్ళు. సగం ఉన్న చెరువునీళ్ళలో పడి రామారావు చనిపోవటం ఏమిటీ? కొద్దో గొప్పో యీత వచ్చినవాడే మరి.

"మనిషితోపాటే 'చావూ' పుడుతుంది. మనిషితో ఉంటూనే తటాల్న మనిషిని తనలోకి లాక్కుంటుంది" అన్నారు కృష్ణారావు మాస్టారు. "సడెన్ డెత్ అంటాం.. అంటే, సడన్‌గా చావొచ్చిందని! మృత్యువు ఎక్కడ్నించీ రాదు. అది మనతోనే పుట్టింది గనక మనతోనే ఉంటుంది.!" మళ్ళీ ఆయనే అన్నారు.

"నాకు సరిగ్గా అర్థంకావటంలేదు సార్!" అడిగాడు ప్రసాదు. మా క్లాస్‌మేట్.

"సరే.. నీకో పెద్ద మంచుగడ్డని ఇస్తా.. క్షణక్షణానికీ అది కరిగిపోతుందిగదూ?"

"అవునూ"

"జీవితమూ అంతే. కొంతమంది నూరేళ్ళ ఆయుష్షు తెచ్చుకుంటే కొంతమంది రామారావులా పదమూడేళ్ళే తెచ్చుకుంటారు. 'ఎన్నేళ్ళు' అనేది మనిషి రుణాన్ని బట్టి వుంటుంది. క్షణక్షణం ఐసుగడ్డ కరిగినట్టే జీవితమూ కరిగిపోయి చివరికి శరీరం మాత్రమే ఇక్కడ మిగుల్తుంది" వివరించారు మాస్టారు.

"శరీరం కూడా వెళ్ళిపోవాలిగా మరి?" అడిగింది సరస్వతి.

"పూడ్చేస్తాంగదా! పోనీ దాన్ని అలాగే వదిలేసినా కొన్నాళ్ళకి మట్టిలో కలిసిపోతుంది" వివరించారు మాస్టారు మళ్ళీ.

"ప్రాణం పోయిన క్షణంలోనే శరీరం కూడా మాయమైతే యీ బాధ ఉండదుగా!" కన్నీళ్ళతో అన్నాడు ముత్యాలోడు.

"శరీరం అనేది ఎవరి సొంతమూకాదు. తండ్రి 'బీజా'న్ని దానం చేస్తే తల్లి 'అండా'న్ని దానం చేస్తుంది. ఆ రెండూ కలిస్తేనే 'పిండం' ఏర్పడుతుంది. అందుకే, భూమిమీద తీసుకున్న దానాన్ని భూమికే వదిలి ఆత్మ పరమాత్మలో కలిసిపోతుంది.!"

"ఎలా సార్?" అడిగాడు కృష్ణారెడ్డి. చదువులో బాగా ముందుండే కుర్రాడతను.

"ఓ బకెట్టుతో చెరువునీళ్ళు పట్టుకొచ్చి ఎర్రసిరా కలుపు. ఇప్పుడు బకెట్‌లోని నీరు ఏ రంగులో ఉంటుంది?"

"ఎర్రగా ఉంటుంది!"

"గుడ్ దానికి ఓ రెండు దోశెలు పంచదార కలుపు! బకెట్ నీరు ఎలా ఉంటుంది?"

"ఎర్రగా తియ్యగా ఉంటుంది... కొంచెం సిరా వాసనతో!"

"వెరీగుడ్ ఇప్పుడానీటిని తిరిగి చెరువులో పోసెయ్.!"

"సరేసార్."

"నువ్వు చెరువులో కలిపేసిన బకెట్టు నీరుని పట్టి మళ్ళీ బకెట్‌లో పొయ్యి"

"అసాధ్యం కదా సార్?"

"ఎందుకు అసాధ్యం?"

"నీరు నీరులో కలిసిపోయిందిగా!"

"కానీ నువ్వు చెరువులో పోసింది మామూలు నీరు కాదుగా.. ఎర్రనిదీ తియ్యనిదీ.. సిరావాసన వచ్చేదీ.!"

"అయినా ఆ నీటిని వెనక్కి తియ్యటం అసాధ్యమేకదండీ!"

"గుడ్! బకెట్ అనేది శరీరం అనుకో.. అందులో నింపివున్న నీరు ఆత్మ లేక ప్రాణశక్తి అనుకో.. చెరువు అనేది పరమాత్మ లేక అనంతమైన ప్రాణశక్తి అనుకో. నువ్వు కలిపిన ఎర్రరంగూ, పంచదారా 'గుణాలు' అనుకో.. ఇలా చూస్తే - శరీరంలో ప్రాణం ఉన్నంతవరకూ శరీరం నడుస్తుందీ, నవ్వుతుందీ అన్నీ చేస్తుంది. ఆ ప్రాణశక్తి ఎగిరిపోతే నిర్జీవమై ఏమీ చెయ్యలేదు. ఖాళీ బకెట్టులా మిగిలిపోతుందన్నమాట!" వీలున్నంతగా వివరించారు కృష్ణారావుగారు. ఆయన చెప్పిన ఉదాహరణ నా మనసుకి హత్తుకుంది. దిగులు కొంత తీరిందిగానీ, మృత్యురహస్యం మాత్రం పూర్తిగా అర్థంకాలేదు. నా మనసులో ఎన్నో ప్రశ్నలు.

అసలు పుట్టడం ఎందుకూ? సరే పుట్టాము. మరి మృత్యువు మీద మనిషి అధికారం ఎందుకు లేదూ? మృత్యువు చేతిలో మనిషి కీలుబొమ్మలా ఎందుకుండాలి? మాస్టార్ని అడుగుదామనుకున్నాగానీ అడగలేదు. మొదట నేను అడగదల్చుకున్న ప్రశ్న స్పష్టంగా ఉంటేనే కదా మాస్టారు స్పష్టమైన సమాధానం చెప్పటానికి!

"పిల్లలూ జీవితం అనేది ఓ లెక్కలాంటిది. ఇందులో కూడికలూ తీసివేతలూ భాగాహారాలూ గుణకారాలూ అన్నీ ఉంటై. శేషం 'జీరో' ఎప్పుడు వస్తుందో అప్పుడు జీవితం మన రామారావులాగా సమాప్తమైపోతుందన్నమాట..!" అన్నారు లెక్కల మాస్టారు ఆంజనేయులుగారు.

"అంటేసార్?" అడిగాడు రంగారావు.

"ఓరి బుద్ధిహీనుడా.. నేనన్నదానికి అర్థం చాలా సింపుల్. పుచ్చుకోవలసిన రుణాన్ని పుచ్చేసుకున్నాడు. తీర్చేసుకోవాల్సిన రుణాన్ని తీర్చేసుకున్నాడు. శేషం 'సున్నా'. అందుకే పోయాడు!" ఆయన ధోరణిలో అన్నారు ఆంజనేయులుగారు.

"కూడికలూ తీసివేతలూ అన్నారుగా?" అడిగింది విజయలక్ష్మి.

"సరే! ఒకడున్నాడు.. వాడి అంకె ఒకటి అనుకో.. వాడు పెళ్ళి చేసుకుంటాడు. అంటే మరో ఒకటి యీ ఒకటితో కలిసిందన్నమాట. ఇప్పుడే భార్యాభర్తల సంయుక్త సంఖ్య రెండు. వాళ్ళకి ముగ్గురు పిల్లలు పుట్టారనుకో అప్పుడేమవుతుంది? రెండూ +మూడూ = 5. అందులో ఓ పిల్లాడు చనిపోయాడనుకో మిగిలేది ఎంత? 5-1=4. అర్థమైందా? అయినా ఇప్పుడివన్నీ మీకు చెప్పటం నాదే బుద్ధితక్కువ. మీలాగే నాకూ మనసులో బాధగా ఉంది. చెప్పి పెట్టకుండా ఆ వెధవ చెరువులో యీతకెళ్ళి చచ్చారుకున్నాడు. వాడు

కూర్చునే ఆ బెంచీ చూస్తున్న కొద్దీ నాకు ఏడుపొస్తోందిరా పిల్లలూ.. నిజంగా ఏడుపొస్తోంది!" జేబులోంచి రుమాలు తీసి మొహానికి కప్పుకుని కూర్చుండిపోయారు లెక్కల మాస్టారు. వెక్కుతున్నట్టుగా ఆయన పొట్ట ఎగిరెగిరి పడుతోంది. మాకూ ఏడుపు ఆగలా. ఆయన చాలాసేపు బెల్లు కొట్టేంతవరకూ నిశ్శబ్దంగా ఏడుస్తూనే ఉన్నారు.

'తిండిబెల్లు' కొట్టినా 'తినా'లనే కోరిక కలగలా.

"ఎన్నిసార్లు రామారావుగాడు వాడి సైకిల్ మీద నన్నెక్కిచ్చుకుని స్కూల్లో దింపాడోనే. వాడివ్వాళ 'లేడు' అనుకుంటే ఏడుపు తన్నుకొస్తోందే!" బేలగా అన్నాడు జోగారావు. "మా నాన్న ఎవర్నీ చెరువులో దిగనివ్వడు.. ఆఖరికి నన్నుకూడా!" మళ్ళీ అన్నాడు జోగ్గాడు.

ఫోర్త్ పీరియడ్ బెల్ కొట్టడంతో అందరం క్లాసుల్లోకి వెళ్ళాం. మాములు రోజుల్లో అయితే చెవులు పగిలేంత సందడి ఉండేది. ఇవాళ మాత్రం స్కూలు మౌనంగావుంది.

స్కూలు గంటలు కొట్టే ప్యూన్ కం వాచ్‌మేన్ జాకోబు 'నోటీసు' తెచ్చాడు హిందీ మాస్టారు ఆ నోటీసుని తీసుకుని బిగ్గరగా చదివారు.

*"ప్రియమైన విద్యార్థులారా,..నిన్న జరిగిన సంఘటన, అంటే, మన విద్యార్థి రామారావు అకాలమృత్యువాతపడటం, నిజంగా ఎంతో విచాకరమైన సంఘటన. దానికి మీరూ, మేమూ అనగా టీచర్లం కూడా ఎంతో బాధపడుతున్నాం. ఇటువంటి సంఘటన మళ్ళీ పునరావృత్తం కాకూడదు. దయచేసి ఎవరూ పెద్ద చెరువులోగానీ, బూడిదగుంట చెరువులోగానీ మిగతా చెరువుల్లో కానీ యీతలు కొట్టవద్దని మీ ప్రధానోపాధ్యాయుడిగా మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను. ఈ విషాద సమయంలో రామారావు ఆత్మకి శాంతి కలగాలనీ, భగవంతుడు రామారావు కుటుంబానికి యీ బాధని భరించే శక్తినివ్వాలనీ, రామారావు కుటుంబానికి మన ప్రగాఢ సానుభూతిని అందజేస్తున్నా.*

*ఇట్లు..*
*పేరి రాజారావు*
*ప్రధానోపాధ్యాయులు..*

చదివాక హిందీ మాస్టారు సంతకం చేసి ఆ నోటీసుని జాకోబుకి ఇచ్చారు. అది అన్ని క్లాసులకీ వెడుతుందనీ అందరు మాస్టర్లూ పిల్లలకి చదివి వినిపిస్తారనీ మాకు తెలుసు.

హిందీ మాస్టారు ఓ కవితని హిందీలో చదివి మాకు తెలుగులో అర్థం చెప్పారు.

"బతికివున్న ఓ మనిషీ. చనిపోయిన వానికోసం ఎందుకు దుఃఖిస్తావూ? ఈ సృష్టిలో మృత్యువు ఆటలాడుకోని జీవి అంటూ ఉన్నదా? ఈ లోకం అత్తవారిల్లు.. ఈ అత్తవారిల్లుని వదిలి పుట్టింటికి ఏదో ఓనాడు పోక తప్పదు.. తప్పదుకాక తప్పదు. అందుకే జీవించి ఉన్నంతకాలం ఆనందించు.. కన్నీరు కార్చకు!" అని.

క్లాసులు జోరుగా సాగుతున్నై. ఫస్టుఫాంనించి థర్డ్‌ఫాందాకా లెక్కలకీ తెలుగుకీ సాంఘిక సామాన్య శాస్త్రాలకీ ఇంగ్లీషుకీ ఒక్కొక్క సబ్జక్టుకీ ఒక్కొక్క మాస్టారు చెప్తారు. ఫోర్త్‌ఫాం నించీ ఎస్.ఎస్.ఎల్.సిదాకా మాస్టర్లు మారతారు. అందుకే మా టీచర్లు చెమటోడ్చి మరీ మాకు పాఠాలు చెబుతున్నారు. థర్డ్‌ఫాంలో ఎంతమంది పాసైతే మా మాస్టర్లకి అంత క్రెడిట్. నూటికి నూరు పర్సంటూ పాసైతే మా మాస్టర్ల ఆనందానికి అంతువుండేదికాదు.

రామారావు జ్ఞాపకాలు తెలియకుండానే పాతబడినై. అదే విషయం మా వైద్యుల కృష్ణారావు మాస్టార్ని అడిగితే చెప్పారు.., "కష్టాలన్నీ గాయాలే.. కాలంతోటే మానాలే.!" అన్నారు. ఎంతటి గాయాన్నైనా మాన్పేశక్తి 'కాలా'నికి ఉందట. అందుకే పరమేశ్వరుడ్ని 'కాలాయనమః' అనీ 'కాలకాలాయనమః' అనీ కీర్తిస్తారుట. నాకూ నిజమే అనిపించింది.

అంతా బాగానే ఉందిగానీ నాకూ మా అమ్మకీ సయోధ్య కుదరటంలా. సెకెండ్‌ఫాం చదివే నా ఫ్రెండు 'అష్రఫ్ ఉన్నీసా' ఇంట్లో ఉండే సీమ కుక్క నాలుగు పిల్లల్ని పెట్టిందిట. నేను వాళ్ళింటి కెళ్ళి చూసి కూడా వచ్చాను.

బుజ్జి బుజ్జి పిల్లలు.. ఇంకా పూర్తిగా కళ్ళు కూడా తెరవలేదు. అన్నీ తెల్లగా ఉన్నాయి. ఒకదానికి మాత్రం నుదుటిమీద నల్లని మచ్చ ఉంది.

"అబ్బ భలే ఉందే అదీ!" అన్నాను చూడంగానే.

"అయితే మావాళ్ళ నడిగి నీకిచ్చేస్తా.. అయితే ఇప్పుడే కాదనుకో.. ఇప్పుడు ఇస్తే దానికి పాలు దొరకవుగా మరీ!" అన్నది.

నేను ఇంటికెళ్ళి మా అమ్మతో, "అమ్మా.. ఆ నల్లబొట్టు పిల్లని పెంచుకుందామే.!" అన్నా. ఛట్.. వీలుకాదదంది. మడీ ఆచారం మంట గలుస్తాయంది. దాన్ని సాకడం తనవల్లకాదదంది.

"మరి కుక్కల పండగరోజున నన్ను గోనెసంచితో రోడ్లన్నీ తిప్పిస్తావుగా? పెంచుకుంటే వచ్చిన నష్టం ఏమిటి?" అని నిలదీశా.

"ఆ విషయంవేరూ.. యీ విషయం వేరూ! అది సంవత్సరానికి ఒక్కసారి కుక్కని పెంచడం అంటే మాటలు కాదు. చచ్చే చాకిరీ! కావాలంటే రోజూ ఆ కుక్క దగ్గరికెళ్ళి చూసిరా. అంతేగానీ ఇంటికి తీసుకొస్తే మాత్రం కాళ్ళు విరగ్గొడతా. మీ నాన్న చెప్పినా యీ విషయంలో నేను వినేదిలేదు.!" అని డిక్లేర్ చేసింది. మొత్తం కథంతా మా నాన్న వింటూనే ఉన్నాడుగదా.. ఇంకేమి చెప్పేదీ?

రాత్రి మా అమ్మ వంట చేస్తున్నప్పుడు మా నాన్నని వాకిట్లోకి తీసికెళ్ళి, "నిజంగా ఆ కుక్కపిల్ల చాలాబాగుంది నాన్నా. అష్రఫ్ కూడా వెంటనే ఇవ్వడానికి ఒప్పుకుంది. ఒక్కసారి అమ్మతో మాట్లాడునాన్నా!" అని బతిమలాడాను.

"ఇప్పుడు ఆ విషయం ఎత్తితే మీ అమ్మ మనిద్దర్నీ ఉతికి ఆరేస్తుంది. నాలుగురోజులు గడవనీ. అప్పుడు చూద్దాం.!" అన్నాడు మా నాన్న.

"వింటున్నా వింటున్నా.. వింటూనే ఉన్నానే మీ తండ్రీకూతుళ్ళు మంతనాలు. నాల్రోజులు కాదు.. నాలుగువందల జన్మలెత్తినా ఈ ఇంట్లో కుక్క అనే ప్రాణి అడుగుపెట్టడానికి వీలేదు. ఆ.!" అంటూ లోపలికి పోయింది మా అమ్మ. మా నాన్నకి ఆశ్చర్యం.. అమ్మ ఎక్కడ్నించి వచ్చిందా అని.

"హూ!.! తలుపు పక్క నిలబడి వినడం ఆ పెదపాడు వాళ్ళకి అలవాటేగా! నేను నిన్ను బయటకు తీసుకొస్తుంటే చూసి వుంటుందీ" మా నాన్న డౌట్‌ని క్లియర్ చేశాను.

నాకూ పంతం పెరిగింది. థర్డ్‌ఫాం ఏ సెక్షన్ పిల్లకి ఆఫ్టరాల్ ఓ కుక్కపిల్లని పెంచుకునే హక్కు కూడా లేదా? అదీ వీధి కుక్క అయితే పోనీ అనుకోవచ్చు, 'ఏ' క్లాస్ సీమ కుక్కపిల్లకి ఏమయిందీ?

పదిహేనురోజుల తరవాత ధైర్యంగా కుక్కపిల్లని ఇంటికి తెచ్చా. దానికి 'మోతీ' అని పేరు కూడా పెట్టాను.

మా అమ్మ ఒకటే గొడవ. కుక్కపిల్లకూడా మహా చురుకైంది. అది మా అమ్మ ఎక్కడుంటే అక్కడికి పరిగెత్తడం – మా అమ్మ అనవసరంగా 'మడి' చెడుతుందని అరుగుమీదనే ఎక్కడం, కుక్కపిల్లకూడా అరుగు ఎక్కుదామని ప్రయత్నించడం, మా అమ్మ నన్ను నానా తిట్లూ తిట్టడం.. పొద్దున్నే గడబిడ గడబిడ అయింది.

మా నాన్న పచారీ కొట్టుకి వెళ్ళడంతో జరిగిన వ్యవహారం ఆయనకి తెలిదు. ఆయన రావడాన్ని చూస్తూనే మా అమ్మ "యీ కుక్కని బయటికి వెళ్ళగొడతారా లేకపోతే నన్ను మా పుట్టింటికి పొమ్మంటారా? యీ దెయ్యపు పిల్లతోటే వేగలేక చస్తుంటే దానికితోడీ కుక్కపిల్ల ఒకటి.. నా వల్లకాదుగాక కాదు.!" అని అరుపులు మొదలెట్టింది.

"పోనీలేవే.. సీతకి నేను చెబుతాగా.. సీతా, దాన్ని ఓ తాడుతో కట్టేయ్. లోపలికి వస్తే మీ అమ్మకి ఇబ్బంది అవుతుంది గనక ఆ వేపచెట్టు నీడలో కట్టేయ్! అట్లాగే దాన్ని బయటే తిప్పుకానీ ఇంట్లోకి రానీకు!" అన్నాడు.

"అసలది యీ కాంపౌండులోనే ఉంటానికి వీల్లేదు.. దాన్ని బయటికి తీసి కెళ్ళి ఎవరిచ్చారో వాళ్ళకి ఇచ్చెయ్యమనండి!" పంతం పట్టింది మా అమ్మ.

"హూ.! ఒక్క చిన్న కుక్కపిల్లకి ఇంట్లో చోటివ్వలేని బ్రతుకెందుకూ? ధర్మరాజులాంటివాడే కుక్కని అపురూపంగా పెంచుకున్నాడనీ, చివరికి ఆ కుక్కే స్వర్గం దాకా ధర్మరాజుకి తోడు వచ్చిందనీ పురాణం శాస్త్రుర్లుగారు చెప్పలేదా? అసలు కాలభైరవుడంటే ఎవరూ? కాలభైరవాష్టకం చదువుతారుగానీ కుక్కని మాత్రం పెంచుకోవద్దంటారు. మనిషికి అత్యంత విశ్వాసపాత్రమైన జంతువు కుక్కేకదా! ఏదో మనం తినేదేదానికి పెడితే ఏం పోతుందీ? అసలు ఎంత పుణ్యం వస్తుందీ? హూ.! నువ్వంటే పిచ్చిప్రేమ పెంచుకుని అది నీ వెంట పడుతోందిగానీ, దాన్ప్రేమ నీకేం అర్ధమౌతుందీ. సర్లేవే అమ్మా ఇది నీ ఇల్లు.. నీ ఇష్టప్రకారమే కానీ కుక్కని రేపొద్దున్నే ఇచ్చేసి వస్తా. కానీ నన్ను మాత్రం అన్నం తినమని అడక్కు!" గంభీరంగా మొహం పెట్టి కుక్కని ఎత్తుకుని దాని మెడకి నెప్పి తగలకుండా ఓ గుడ్డపీలికతో జారుముడివేసి వేపచెట్టు మొదటకి కట్టేశా.

నేనూ ఆ చెట్టుకిందే ఓ చాపవేసుకుని కూర్చుని పుస్తకాలు ముందరేసుకున్నా. మా నాన్న నా వంక విచిత్రంగా చూసి లోపలికి వెళ్ళాడు. నా 'ఎత్తు' ఆయనకి అర్ధంకాలేదని నాకు అర్ధమైంది.

ధర్మరాజూ - స్వర్గం - కాలభైరవాష్టకం - పుణ్యం.. యీ మాటల్ని మా అమ్మ అంత త్వరగా మర్చిపోదు.

పన్నెండు దాటింది. మా అమ్మ పెరట్లో రోటిదగ్గర 'రుబ్బు'తున్నప్పుడు కొంచెం పాలని సంగ్రహించి ఓ కొబ్బరి చిప్పలో పోసి మోతీకి తాగించా. ఏమీ తెలీనట్టు బెట్టుగా కూర్చున్నా. ఆదివారం గనక స్కూలులేదు.

నా సి.ఐ.డీ ముక్కు బ్రహ్మాండంగా పనిచేస్తోంది. 'అన్నం తినను' అన్నాను గనక నా బెట్టుని ఎలా గట్టెక్కించాలో మా అమ్మకి బాగా తెలుసు. బంగాళాదుంపల వేపుడు వాసనా, బెండకాయపులుసు వాసనేగాక ఉల్లిపాయ పకోడీల వాసన కూడా నా ముక్కు గ్రహించింది. ఇందాక కందిపచ్చడి రుబ్బనే రుబ్బిందిగదా!

నోట్లో నీరూరుతోంది. కనీసం బతిమలాడుతున్నట్టు ఆవిడ 'యాక్టు' చేసినా నేను నా ప్రతిజ్ఞని విరమించుకుందునుగదా! ఊహూ.! మహా కిలాడీ.

"రావే సీతా.. నువ్వు రాకపోతే నేనూ అన్నం తినను!" పిలిచాడు మా నాన్న.

"హూ.! తండ్రిని పస్తుంచేంత దుర్మార్గురాలు కాదు యీ సీత!" గట్టిగా మా అమ్మకి వినిపించేలా అరిచిలోపలికెళ్ళాను.

***తమ్మిలేటిపుణ్యామా అని...***

మా డ్రిల్లు మేస్టారు వేదాంతాచార్యులుగారు. మాంఛి బలిష్టంగా ఎత్తుగా వుండేవారు. ఓసారి మొత్తం స్కూలు పిల్లల్ని 'తమ్మిలేరు' ఎక్స్‌కర్షన్‌కి తీసికెళ్ళారు. క్లాసులవారీగా 'లైన్'లలో నడుస్తూ బయలుదేరాం. క్లాసుటీచర్లు ముందరే హెచ్చరించారు... ఏ మాత్రం కిలాడీవేషాలు వేసినా 'కూసాలు' అదిరిపోతాయని. ప్రతి పదిమందికీ ఒక లీడరు. ఎవరు కనిపించకపోయినా బాధ్యతవాడిదేనన్నమాట.

మధ్యమధ్యలో పాటలు.. ఎవరో ఒకరు మొదలు పెడతాం. మిగతావాళ్ళు 'గోంగూరకీ' అని కోరస్ పాడాలి. ఉదా: 'ఎంకమ్మ ఎళ్ళింది'... అనగానే మిగతావాళ్ళు 'గోంగూరకీ'

ఏట్లో నా దూకిందీ... ... ... ...||

చిట్టెమ్మ నవ్వింది .. .. ... ... ||

చిలకమ్మ పాడిచింది.. ... .. ... ||

ఇలా సాగిపోతూనే వుంటుంది. ఎవరు ఏ పదాలు పాడినా అన్నీ గోంగూరకే. ఒకళ్ళ కాళ్ళు ఒకళ్ళు తొక్కడం ఓ సరదా. మూడుమైళ్ళకి పైనే నడవాలి. చెరువుగట్టు మీద నించి అయితే. సాఫైన దారి అదే గనక అటే నడిచిపోతున్నాం. ఎస్సెల్సీ వాళ్ళూ ఫిఫ్త్‌ఫాం వాళ్ళూ వంట సామాన్లు, కూరలూ మోసుకుంటూ ముందరెళ్ళిపోయారు. ఆ రోజుల్లోనే సినిమాలో డైలాగుల్ని అనుకరిస్తూ 'బాబాయ్' అనో గురూ' అనో మగపిల్లలు పిల్చుకుంటూ ఉండేవారు. ఆడపిల్లలు కూడా ఏమీ తీసి పోకుండా, 'చెలీ' 'నెచ్చెలీ' 'ప్రాణసఖీ' అంటూ పిల్చుకునేవాళ్ళు.

"చెలీ.. జయలక్ష్మీ ఇంకెంతసేపే యీ పయనము?" అని పుష్పకుమారి అంటే,

"తెలియదే నెచ్చెలీ.! నా కాళ్ళు నొచ్చుచున్నవి" అని విజయలక్ష్మి ఉవాచ.

"ఎంత సుకుమారివే!" కమల

"అవునే! చిరుగాలి కొట్టి నా బుగ్గ ఎర్రబడినదే!" విజయ.

"మాట్లాడకుండా నడవండి.. ఏమిటీ .. చంపేస్తాను. ఏమిటీ, వెధవ్వేషాలొద్దు. ఏమిటి?" ఈ మాటలన్నది నేనే, మా క్రాఫ్టు టీచరుగార్ని అనుకరిస్తూ.

"భలే పట్టేశావే.. ఏదీ మన లెక్కల మాస్టార్ని అనుకరించు చూద్దాం!" ఎంకరేజ్ చేశారు జనాలు. అదెంతసేపూ!

"ఒరే బుద్ధిహీనుల్లారా.. చదివించావంట్రా.! ఒక్క మెట్టుమొట్టానంటే తాటాకు మీదకెక్కుతారు.!" ఆంజనేయులు మాస్టార్ని ఇమిటేట్ చేశా.

"ఇంకొక్కసారి చెప్పమ్మా సీతా!" వెనక్కి తిరిగి చూద్దునుకదా.. ఆయనే. గుండె గుభిక్కుమంది.

"అదికాదు మాస్టారూ.! మీ గొంతులో ఒక ప్రత్యేకత వుంది.. అందుకే.." అంటూ ఆయన్ని ఉబ్బేసే ప్రయత్నంచేశాం.

"డొక్కచించేస్తా మళ్ళీ నన్ను ఇమిటేట్ చేస్తే .. బుద్ధిహీనురాలా!" అంటూ వార్నింగిచ్చి ఆయన ముందుకెళ్ళారు.

మొత్తానికి తమ్మిలేరు చేరాం. అంతా అడవి. ఎంత అందమైన ఏరూ! 'రెండురాళ్ళ' మధ్య నించి సన్నగా పారుతోంది. నీళ్ళని చూస్తే వదలబుద్ధికాదుగదా! ఆడతాంగదా! మా టీచర్లు కూడా చిన్నపిల్లలైపోయారు. మాతోపాటే వాళ్ళూ పిల్లల్లాగా నీళ్ళల్లో దిగారు. ఏమి హాయిలే హలా.!

వంట వేదాంతాచార్యులుగారిది. దోసకాయపప్పు... కొబ్బరిపచ్చడి.. చిక్కుడుకాయకూర.. బంగాళాదుంపలకూర.. పులిహోర బజ్జీలు.. బ్రహ్మాండమైన ముక్కలపులుసు. అన్నిటికన్నా అద్భుతం. ఆయన ప్రత్యేకంగా చేసిన వంకాయ పెరుగుపచ్చడి.

పొట్లకాయ పెరుగుపచ్చడి తెలుసుగానీ వంకాయితో పెరుగుపచ్చడి చేస్తారని నాకు అప్పటిదాకా తెలీదు. వాసన నోరూరించేస్తోంది. అప్పుడే కోసిన వాక్కాయిలతో మళ్ళీ కొబ్బరి కలిపి ఇంగువపోపు పెట్టి మరో వెరైటీ పచ్చడి చేశారు.

ఈసారి లేడీటీచర్ కస్తూరిగారు ఆడపిల్లల్తో టగ్ ఆఫ్ వార్, రింగ్ టెన్నిస్ ఆడిస్తున్నారు. నేను రింగ్ టెన్నిస్ ఆడుతున్నా. నేనూ సరస్వతీ ఇటు - కమలకుమారీ, వసంతలక్ష్మీ అటు.

సడన్‌గా కడుపులో నెప్పి మొదలై కూలబడిపోయా. నడుం అంతా పోట్లు. పొత్తి కడుపంతా నెప్పి.. భరించలేనంత నెప్పి.

"ఏమయింది సీతా?" ఖంగారుగా అడిగారు టీచర్.

"నెప్పిగా ఉందండీ. కడుపులో!" అన్నారు. కొంచెం నెప్పి తగ్గినట్టే అనిపించింది. భోజనాలకి పిలుపు. వేదాంతాచార్యులుగారి వంట ముందు మా అమ్మ వంట తేలిపోయిందనిపించింది. అద్భుతమైన రుచీ రంగూ. తింటూ వుండంగా మళ్ళీ నెప్పి పొత్తికడుపులో పోట్లు. నా వల్లకాలేదు.

"నెప్పిగా వుంది టీచర్" కన్నీళ్ళతో అన్నాను.

"పోనీలే చెయ్యికడుక్కో!" అన్నారు. లేచాను.

"లేవద్దు కూర్చో" గట్టిగా అన్నారావిడ.

"ఏం టీచర్.. చెయ్యి కడుక్కోవాలి!" అన్నా.

"ఉహూ! అక్కడేవుండు అంటూ చెంబుతో నీళ్ళు తెచ్చి ఇచ్చారు.

"నే చెప్పేదాకా లేవొద్దు!" అని గుసగుసగా నా చెవిలో చెప్పారు.

ఓ పక్క నెప్పి. పళ్ళు బిగబట్టుకుని ఉన్నాను.

భోజనాలు పూర్తి అవడంతో పిల్లలందరూ లేచి, చేతులు కడుక్కోడానికి 'ఏటి' దగ్గరికెళ్ళారు.

"నువ్వు పెద్దమనిషివయ్యావు. అందుకే లేవొద్దన్నా.!" అని ఆవిడ నాకు చెప్పి, వయసులో పెద్దదైన సుశీలా టీచర్ దగ్గరికెళ్ళి కాసేపు మాట్లాడారు. ఎస్సెల్సీ చదివే ఆడపిల్లల్నీ పిలిచారు. నాకేమీ అర్థం కావడంలా. మా ఎస్.పి.ఎల్ భాస్కరావుని పిలిచి అర్జంటుగా బండి కట్టించుకురమ్మన్నారు. కస్తూరిగారు తన క్లాసు పిల్లల్ని సుశీలగారికి వొప్పజెప్పారు.

అడవిలోకి బండిరాదు. బండి ఎక్కాలంటే ఓ పావుమైలు నడిచి నాగిరెడ్డిగూడెం వైపు తిరగాలి. కూర్చోవడానికి మేము మోసుకొచ్చిన దుప్పట్లలో ఒక దుప్పటిని నా నడుముకి లుంగీలా చుట్టి కస్తూరిగారూ మరో ముగ్గురు ఎస్సెల్సీ అమ్మాయిలూ నన్ను నడిపించుకుంటూ బండి ఎక్కేచోటికి తెచ్చారు. ఆ పావుమైలూ నడవటానికి కనీసం నాకు గంటపట్టింది. చెప్పలేని నొప్పి. మధ్య మధ్యలో ఏడుస్తూ కూర్చుండిపోయాను. చివరికి నన్ను బండి ఎక్కించి వాళ్ళూ బండి ఎక్కారు.

బండి కుదుపుల్తో నా ప్రాణం కొట్టుకుపోతోంది.

మొత్తానికి ఇల్లు చేరాం. బండి ఆగగానే బయటికి వచ్చిన మా అమ్మ కంగారుగా బండి దగ్గరికొచ్చి, "మళ్ళీ ఏం తెచ్చుకున్నావే. ఎక్కడైనా పడ్డావా?" అని గడబిడగా అడిగింది. నేను బండి దిగలేకపోతున్నాను.

"మీరేం వ్వరికావొద్దండీ.. మీ అమ్మాయి పెద్దమనిషైంది!" నవ్వుతూ కస్తూరిగారు మా అమ్మతో చెప్పారు.

"ఎప్పుడూ.. టైం చూశారా.! మొహం 'ఇంత' చేసుకుని అన్నది మా అమ్మ "ఏవండోయ్!" అని మా నాన్నని పిల్చింది.

నా బాధకనిపెట్టి మా నాన్న స్టూల్ తీసుకొచ్చి బండి దిగటానికి వీలుగా వేశాడు.

"అర్జంటుగా మిఠాయిలు తెచ్చి టీచరుగారికీ పిల్లలకీ పెట్టండి.. మంచి కబురు చెప్పారు!" నవ్వుతూ అన్నది.

"ఇప్పుడు అవేమీ వొద్దండి.. అందరం భోంచేసే వచ్చాం.. మళ్ళీ వస్తాంగా.. సీతా, జాగ్రత్త.. పదిరోజుల తరవాత కలుద్దాం!" అంటూ టీచర్ గారూ వాళ్ళూ వెళ్ళిపోయారు.

హడావిడి మొదలు. ఇరుగు పొరుగు ఆడవాళ్ళొచ్చారు. చిన్న సీతా వాళ్ళమ్మ తాటాకులు కొట్టించి తెప్పించింది. ఓహ్.. హడావిడే హడావిడి. నాకు ఓ పక్క నెప్పి, మరోపక్క నీరసంతో, మా అరుగుమీదే వాలిపోయి కళ్ళుమూసుకున్నాను.

"అడవిలో పెద్దమనిషివైనా రెండొందలమంది ఆ పూట భోజనం చేశారంటే ఎంత అదృష్టవంతురాలివే! మీ టీచరు చాలా తెలివైంది.. నువ్వు ఆడుతూ 'నెప్పి' అన్నప్పట్నించీ టైమ్ చూసి చక్కగా గుర్తుపెట్టుకుంది. చెన్నావఝుల శాస్త్రిగారికి చూపిస్తే బ్రహ్మాండమైన ముహూర్తం అన్నారు.!" స్నానం అయినరోజున తన మెడలోని గొలుసు తీసి నా మెడలో వేస్తూ అన్నది మా అమ్మమ్మ.

మావయ్యలూ అత్తయ్యలూ పిల్లలూ అందరూ వొచ్చారు. నా బాధ మా నాన్నగురించే. మొహమాటం ఎక్కువ. అప్పటికీ అడుగుతూనే వున్నాను; "అమ్మా నాన్నకి కాఫీ ఇచ్చావా? టిఫిన్ పెట్టావా?" .. అంటూ.!

అసలు ఆవిడకి తీరికెక్కడిదీ! వెంకట్రావుని ఇంటికి పిలిపించి బట్టలు కుట్టించడం.. ఇరుగుపొరుగు వాళ్ళ సహాయంతీసుకుని తీపీ కారం తినుబండారాలు తయారుచేసి అటకెక్కించడం.. ఓహ్.!

మా అత్తయ్యలు కూడా హడావిడి చేస్తూనే వున్నారు. ఇల్లంతా చుట్టాల్తో కళకళ. ఇంటి ముందు బ్రహ్మాండమైన పందిరి. దానికి మామిడాకులు కట్టారు. నన్ను బుట్టబొమ్మలాగా అలంకరించారు. పేరంటాలూ భోజనాలూ మిగతా అందరివీ అయ్యేసరికి నాలుగుదాటింది. నేను మాత్రం మా నాన్న కోసం ఎదురుచూస్తున్నా. తప్పని సరై కోర్టుకి వెళ్ళారట. నన్ను గదిలో కూర్చోపెట్టారు...ఇన్నాళ్ళూ బయటికి రానివ్వలేదుగదా. దూరంగా సైకిల్ తొక్కుకుంటూ మా నాన్నరావటం చూసి అటు పరిగెత్తబోయా.

"ఆగాగు.! నువ్వేం ఇప్పుడు చిన్నపిల్లవికావు.. అరుగులు దూకి పరిగెత్తడానికి. కొంచెం నెమ్మదితనం నేర్చుకో!" మా సుభద్రమ్మ అత్త నా చెయ్యిపట్టుకుని ఆపింది. ఈలోగా మా నాన్నే వచ్చారు. స్టాండు కూడా వెయ్యకుండా నా వంక అలానే చూస్తుండిపోయారు.

"ఏంటినాన్నా!" అన్నా కొంచెం సిగ్గుపడుతూ. ఆయన కళ్ళల్లో నీళ్ళు. స్టాండు వేసి నా తలమీద చెయ్యిపెట్టి అస్పష్టంగా ఏవో దీవెనలిచ్చారు. నేనే మా నాన్న చెయ్యిపట్టుకుని లోపలికి నడిపించుకెళ్ళాను. మొదటిసారి ఆరోజు మా నాన్నకి నేను అన్నం వడ్డించి - నేను వొడ్డించుకున్నా. మా అమ్మ గోలపెట్టినా వినలా.

నేను సన్నగా పొడుగ్గా ఉండేదాన్ని. ఇంకోటి ఏమంటే నవ్వొచ్చినా కోపం వచ్చినా చికాకు వచ్చినా నా మొహంలో వెంటనే తెలిసిపోయేది. ఎంతదాచుకుందామన్నా దాగేదికాదు. ఎప్పుడూ ఉరుకులూ పరుగులే.

ఓణీ వేశాక స్కూలు కెళ్ళిన రోజున నా క్లాస్‌మేట్స్ ఆశ్చర్యపోయారు.

"నువ్వు సీతవేనా?" ఆశ్చర్యంగా అడిగింది సరస్వతి.

"ఏం? మొహం మారిందా?" నవ్వి అడిగా.

"లేదే! నిండుగా కనిపిస్తున్నావు.. ఏమో.. చాలా అందంగా వున్నావు!" అన్నది.

మొగపిల్లల చూపుల్లో, ముఖ్యంగా మా పాకబడి బేచ్‌లో చాలా తేడా వచ్చింది. అంతకుముందు ఒసే, ఏమిటే అనేవాళ్ళు ఇప్పుడు అలా అనలేక, 'సీతా' అనటమేగాక దగ్గరగా రావటానికి సందేహిస్తున్నారు. ఎస్సెల్సీ కుర్రాళ్ళయితే కళ్ళు విప్పార్చుకుని మరీ నన్ను చూస్తున్నారు. సరస్వతి నాకంటే మూడునెల్లముందే పెద్దమనిషైందిగానీ దానిలో అంత తేడాలేదు.

ఇక టీచర్లు కూడా 'సీతా' అని మర్యాదగా పిలుస్తున్నారు. తేడా ఎందుకో నాకు తెలీలా. చుట్టాలు పెట్టినవీ, మా అమ్మ కొన్నవీ, బోలెడన్ని దుస్తులు రెడీగా వున్నాయి. నైలాన్‌వి కొన్నీ, పట్టువి కొన్నీ, ఇంకా సిల్కుకాటన్‌వి కొన్నీ అసలు కట్టుకోనేలేదు.

స్కూలునించి ఇంటికెళ్ళాక అద్దంలో పరీక్షగా చూసుకున్నాను. పదిరోజుల్లోనే అంతమార్పు. నా మొహం నాకే అందంగా కనిపించింది. లంగా ఓణీ జాకెట్టుతో ఇంకా పొడుగ్గా కనిపిస్తున్నాను.

"ఏమిటే నిన్ను నువ్వు చూసుకుంటున్నావా?" అడిగింది మా అమ్మమ్మ.

"లేదమ్మమ్మా!" అంటూ సిగ్గుపడ్డాను. (సిగ్గుపడటం అనేది ఎప్పుడు ఎలా నాలో ప్రవేశించిందో నాకు తెలీదు. ఆ క్షణమే నాకు తెలిసింది)

"పిచ్చిదానా!. కొత్తలో అలానే వుంటుందిలే. కానీ జాగ్రత్తమ్మా - పాడులోకం.. మగాళ్ళదగ్గరికి వెళ్ళకూడదు. వాళ్ళని అంటుకోవడం ముట్టుకోవడం అసలు చెయ్యకూడదు.. ఏం!" జాగ్రత్తలు చెప్పింది అమ్మమ్మ.

"ఊఁ" అన్నాను.. తలవొంచుకుని.

*(మళ్ళీకలుద్దాం)*

Post your comments